నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | జులై 28, 2024 | www.navatelangana.com

ఆల్‌ది బెస్ట్ నిఖత్

- నేడు ఒలంపిక్స్‌లో తొలి ఫైట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నిజామాబాద్ జిల్లా నుంచి ఒలంపిక్స్ బరిలో నిలిచిన నిఖత్ జరీన్.. నేడు(ఆదివారం) బాక్సింగ్ పోరులో తొలిసారి తలపడనుంది. పారిస్‌లో జరుగుతున్న ఒలంపిక్ పోటీల్లో బాక్సింగ్ విభాగంలో జర్మని క్రీడాకారిణి కరీనా క్లోయెట్టర్‌తో 50 కేజీల విభాగంలో తలపడనున్నారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టర్ గ్రౌండ్‌లో ప్రాక్టీస్ మొదలు పెట్టిన నిఖత్ తన ప్రతిభతో జాతీయ, అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో నిలిచిచారు. అంచెలంచెలుగా ఎదుగుతూ తొలిసారి ఒలంపిక్స్ బరిలో నిలిచి తలపడనుండగా జిల్లా వాసులు ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు.

ఆగష్టు 15 నుంచి హెల్మెట్ తప్పనిసరి

- పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్


మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్

వాహనదారుల భద్రత, రోడ్డు ప్రమాదాల నుంచి రక్షణ కోసం ఆగస్టు 15 నుంచి ద్విచక్ర వాహనదారులు తప్పనిసరి చేసినట్టు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ శనివారం తెలిపారు. నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో ఆగష్టు 15 తరువాత ద్విచక్ర వాహనాదారులు తమ వ్యక్తిగత రక్షణ నిమిత్తం తప్పక హెల్మెట్ ధరించాలని, అదేవిధంగా హెల్మేట్ ధరించకుండా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఊర పండగకు సర్వం సిద్ధం

- నేడు నగరంలో అమ్మవార్ల ఉత్సవ మూర్తుల ఊరేగింపు
- ఏర్పాట్లు పూర్తి చేసిన సర్వసమాజ్ కమిటీ, అధికార యంత్రాంగం
- బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించిన పోలీస్‌శాఖ



నవతెలంగాణ-కంఠేశ్వర్

ఊరపండకు నిజామాబాద్ నగరం సర్వసిద్ధమైనది. పాడిపంటలు, ప్రజలు సుఖశాంతులతో ఉండేలా దీవించాలని, ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో జరిపే ఊర పండుగను ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నారు. నిజామాబాద్ నగరం మొత్తం నిర్వహించుకునే పండుగలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొననున్నారు.

ఊరపండుగకు బండారు వేసిన రోజు నుంచి గ్రామ దేవతలను కొండెంగా హనుమాన్, అశోక్ విధిలో లోని వడ్లధాతి వద్ద వతాన్‌దార్ల పర్యవేక్షణలో అమ్మవార్ల ప్రతిమలు రూపుదిద్దుకున్నాయి. గ్రామ దేవతలను కొలుస్తూ ఈ ఊర పండుగను జరపడంలో నిజామాబాద్ నగర ప్రజలు ప్రత్యేకత చాటుకుంటున్నారు. గ్రామ దేవతలైన సార్గమ్మ (2 విగ్రహాలు), బోగంసాని, కొండలరాయుడు, బండి, రాట్నం, ఆసు, పెద్దపులి, ఐదు చేతుల పోచమ్మ, మత్తడి పోచమ్మ, మహాలక్ష్మమ్మ, పౌడాలమ్మ, పెద్దమ్మ, అడెల్లి పోచమ్మ, అంపుడు పోచమ్మ ప్రతిమలు ఒకటి చొప్పున ఉంటాయి. వీటిని సరి గంపలతో ఘనంగా ఊరేగిస్తారు. ఖిల్లా చౌరస్తా నుంచి ప్రారంభమయ్యే ఊరేగింపు గాజుల్‌పేట్ మీదుగా పెద్దబజార్ వరకు చేరుకొని అక్కడి నుంచి ఒక్కో ఉత్సవ మూర్తి ఒక్కో వైపునకు తీసుకెళ్లనున్నారు.

పోలీస్ బందోబస్తు..

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం ఉదయం ఆరు గంటలకు నిర్వహించే ఊర పండుగకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. ఊరు పండగ నేపథ్యంలో ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం ఊర పండగ పూర్తయ్యే వరకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. పండగలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎక్కడికక్కడ పోలీస్ బందోబస్తు చేపట్టనున్నారు. ఆయా ప్రాంతాలలో నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజా వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తును పర్యవేక్షించనున్నారు.

స్వచ్ఛందంగా, సామాజిక బాధ్యతతో

తగాదాల పరిష్కారానికి కృషి చేయాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ వెల్లడి
- కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్‌లతో సదస్సు



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్

నవతెలంగాణ-కామారెడ్డి

స్వచ్ఛందంగా సామాజిక బాధ్యతతో చిన్నచిన్న సమస్యలు, తగాదాల పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ సూచించారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్లతో సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2023లో తీసుకొచ్చిన మీడియేషన్ యాక్ట్ ద్వారా సామాజిక స్పృహ సేవా భావం కలిగిన కొందరిని కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్లుగా ఎంపిక చేసామన్నారు. చిన్న చిన్న తగాదాలతో పోలీస్ స్టేషన్‌లు, కోర్టుల వరకు వెళ్లి సమయం, ధనం వృధా చేసుకుంటున్నారని ఇరు వర్గాల సముదాయించి సమస్యను పరిష్కరిస్తే న్యాయంతో పాటు స్నేహపూర్వకంగా సమాజం నిర్మితమవుతుందని అన్నారు. కేరళ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ఇలాంటి మీడియేషన్ సెంటర్ ల ద్వారా ఐదువేలకుపైగా కేసులు పరిష్కరించినట్టు తెలిపారు.

హై కోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ జె. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ తెలంగాణలో ఒక సామాజిక కార్యకర్తల, పెద్దమనుషుల సమక్షంలో తగాదాలను పరిష్కరించడానికి కమ్యూనిటీ మీడియేషన్ వాలంటరీలు పని చేయాలన్నారు. చిన్న సమస్యల వల్ల ఏండ్ల తరబడి కక్ష పెంచుకుంటున్నారని కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులు జీవితం కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని డబ్బులను వృధా చేసుకుంటున్నారని తెలిపారు. ఎలాంటి క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ లేని కమ్యూనిటీ వాలంటీర్లకు గొప్ప బాధ్యతను సక్రమంగా ఎలాంటి లాభేక్ష లేకుండా సామాజిక బాధ్యతతో కుటుంబ, వ్యక్తిగత, భూ వైవాహిక తగాదాలను పరిష్కరించాలని సూచించారు.

తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఈ కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్ల నియామకం జరిగిందని వీరికి రెండు రోజులు శిక్షణ అనంతరం గ్రామాల్లో పనిచేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

'గ్రామాలలో కొందరు ప్రజలు కోర్టు కేసుల వరకు వెళ్తున్నారు.కూర్చుండి కూలంకషంగా పరిష్కరించుకునే సమస్యలను సైతం పంతాలకు పోయి పోలీస్ కేసులు వరకు వెళ్తున్నారు. ఏళ్ల క్రితం గ్రామాల్లో పెద్ద మనుషులే ఇరు వర్గాలతో మాట్లాడి సమస్యను అక్కడికక్కడే పరిష్కరించేవారు. ఇప్పటినుండి సమస్యలను పరిష్కరించి కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్ల రాష్ట్రంలో ఆదర్శవంతంగా పనిచేయాలని' అన్నారు.

జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా సమస్యలను పరిష్కరించడం వల్ల సమాజంలో మంచి వాతావరణం ఏర్పడుతుందని ఇందుకోసం వాలంటరీల కృషి చేయాలని సూచించారు

జిల్లా ఎస్పీ సింధుశర్మ మాట్లాడుతూ సమాజంలో మంచి పేరు, రాజకీయ ప్రమేయం లేని, ఎలాంటి క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ లేని వారిని గుర్తించి కమ్యూనిటీ వాలంటరీగా ఎంపిక చేశామని సామాజిక బాధ్యతతో చిన్నచిన్న తగాదాలను పరిష్కరించాలని, ఎలాంటి ప్రభావములకు గురి కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబెర్ సెక్రటరీ పంచాక్షరీ, కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్, అడిషనల్ జిల్లా న్యాయ మూర్తి లాల్‌సింగ్, శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ నాగరాణి, జూనియర్ సివిల్ జడ్జి కె. సుధాకర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్. చంద్రసేన్‌రెడ్డి సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలకు పోరుబాట

- 30నల గ్రామపంచాయతీ కార్మికుల చలో హైదరాబాద్
- జయప్రదం చేయాలి : సీఐటీయూ పిలుపు


మాట్లాడుతున్న నాయకులు


నవతెలంగాణ-దోమకొండ

పెండింగ్ వేతనాల కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు పోరబాట పట్టనున్నారు. వచ్చేది అరకొర వేతనం అది కూడా సకాలంలో అందక కుటుంబ పోషణ భారంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) పిలుపు మేరకు ఈ నెల 30వ తేదీన చలో హైదరాబాద్‌కు తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల సీఐటీయూ నాయకులు, కార్మికులు సమ్మె వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు.

బీబీపేట్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు, సీఐటీయూ నాయకులు వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులతో మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతు ఈ నెల 30వ తేదీన నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమనికి జిల్లా లో గ్రామపంచాయతీ సిబ్బంది, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయలని పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ కార్మికులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 18 వేలు ఇవ్వాలని కార్మికులందరికి 10 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని, మల్టిపర్పస్ విధానం రద్దు చెయలని, కార్మికుల బకాయి పడ్డ పెండింగ్ లో వేతనాలు చెల్లించాలని ప్రతి నేల 2వ తేదీన వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రాజయ్య, మల్లేష్, రాజు, ప్రభాకర్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి పెరిగిన వరద

- 35 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- నిజాంసాగర్ ప్రాజెక్టు స్వల్ప వరద


చేరుతున్న వరద నీటితో క్రమంగా పెరుగుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

నవతెలంగాణ-బాల్కొండ/నిజాంసాగర్

ఉమ్మడి జిల్లాలో గల ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఉత్తర తెలంగాణ వరప్రదాయిని ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటి ప్రవాహం పెరిగింది. 35 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1074.1 అడుగుల (31.035 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 1087 అడుగుల (66.508 టీఎంసీల) నీరు నిల్వ ఉది. ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి నేటి వరకు ఎస్సారె-స్పీకి మొత్తం 24.766 టీఎంసీల నీరు వచ్చి చేరగా.. మిషన్ భగీరథ, కాలువల ద్వారా మొత్తం 2.354 టీఎంసీల నీరు విడుదల చేశారు.

నిజాంసాగర్ : మండల కేంద్రంలోని నిజాంసా గర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాని కి ప్రాజెక్టులోకి స్వల్పంగా 930 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్ట్ ఏఈఈ శివ శనివా రం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి సామర్థ్యం 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం 3.604 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పదిమీటర్లకు పోచారం ప్రాజెక్టు

నాగిరెడ్డిపేట్: నాగిరెడ్డి పేట్ మండలంలోని పోచారం ప్రాజెక్టు నీటిమట్టం పది అడుగులకు చేరినట్లు ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షానికి ప్రాజెక్టులోకి క్రమంగా వరద నీరు చేరుతున్నట్లు ఆయన తెలిపారు. శనివారం సాయంత్రానికి పోచారం ప్రాజెక్టులో 10 అడుగుల నీరు నిల్వ ఉన్నట్లు ఆయన తెలిపారు.



లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

వేతనాల కోసం..

విన్నవించుకుంటున్నా పట్టించుకోరా..?

- లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు డిమాండ్
- లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్

'లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని గత కొన్ని రోజులుగా నిరసనలు చేపట్టి విన్నవించుకున్నా పట్టించుకోరా..?' పెండింగ్ వేతనాలు చెల్లించి, సమస్యలు పరిష్కరించాలని' సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. గుత్ప, అలీసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్‌లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు గత ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు గత 20రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్‌లు స్పందించకపోవడంతో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా లేబర్ ఆఫీస్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యాలయం ఎదుట తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం లేబర్ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. కార్మిక సమస్యల పట్ల ఇరిగేషన్ అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించకుండా కార్మికుల వేతనాలను చెల్లింప చేయటంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించటాన్ని ఖండించారు. కార్మిక హక్కులను కాపాడాల్సిన అధికారులే నిర్లక్ష్యం చేయటం సమాజ హితానికి సరైనది కాదని ఆయన హెచ్చరించారు. కార్మికుల వేతనాలను అడిగితే కాంట్రాక్టర్ బిల్లులు రాలేదని సాక్ చెబుతున్నారని, బిల్లులకు వేతనాలకు ముడి పెట్టడం ఏరకంగా సరైంది ఆలోచించాలని తెలిపారు. ఇది పూర్తిగా తప్పించుకోవటానికి ఉపయోగపడే మార్గమని అధికారులు ఇదే వైఖరిని ప్రదర్శిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికులు గణేష్, మైపాల్, కార్తీక్, బుచ్చన్న, అజయ్, సందీప్, ప్రవీణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

మంజీరా నీటి ప్రవాహాన్ని పరిశీలించిన కేంద్ర జల శాఖ ఇంజనీర్లు


పరిశీలిస్తున్న కేంద్ర జలశాఖ ఇంజనీర్లు

బోధన్ : సాలూర మండల కేంద్రానికి సమీపంలో గల మంజీర నదిలో నీటి ప్రవాహాన్ని శనివారం కేంద్ర జల శాఖ మంజీర సబ్ డివిజన్ ఇంజనీర్లు పరిశీలించి నీటి సామర్థ్యాన్ని నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 26వ తేదీ శుక్రవారం నాడు మంజీర నది నుండి 243.318 క్యూసెక్కుల నీరు తరలిందని నిన్నటికి 4.07 మీటర్ల నీటిమట్టం నమోదయిందని తెలిపారు. అలాగే శనివారం నాటికి 3.295 మీటర్ల నీటి మట్టం నమోదయిందని తెలిపారు. 5170.668 క్యూసెక్కుల నీరు కిందికి తరలిందన్నారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదనీటితో మంజీర ప్రవాహం పెరుగుతూ, తగ్గుతూ వస్తుందని దానిని ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నామని వారు తెలిపారు. గత రెండు రోజుల క్రితం మంజీరా నదిలో నీటి ప్రవాహం ఆకస్మాత్తుగా పెరగడంతో మందర్న గ్రామ శివారులో పశువుల కాపరులు నదిలో చిక్కుకున్న ఘటన వెలుగు చూసింది. అప్రమత్తమైన పోలీసులు గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో గజ ఈతగాళ్లతో వారిని ఒడ్డుకు చేర్చారు. దాంతో అధికారులు ఎప్పటికప్పుడు మంజీర నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్నారు. మంజీర నదిని పరిశీలించిన వారిలో మంజీర సబ్ డివిజన్ ఇంజనీర్ సతీష్, సైట్ ఇన్చార్జ్ జూనియర్ ఇంజనీర్ జవహర్ లాల్, నిజామాబాద్ సబ్ డివిజన్ జూనియర్ ఇంజనీర్ శ్యాం ప్రకాష్, సాలూర సిడబ్ల్యుసి సిబ్బంది సాయికుమార్, హనుమాండ్లు, బాలాజీ, భాస్కర్ ఉన్నారు.


కిష్టాపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాల

ప్రభుత్వ జీతం..

ప్రయివేటు స్కూలుకు మొగ్గు

- దీనస్థితిలో విద్యార్థులు.. పట్టించుకోని విద్యాశాఖ

నవతెలంగాణ-బీర్కూర్ (నసురుల్లాబాద్)

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేదిశగా ప్రభుత్వాలు ఒక వైపు చర్యలు తీసుకుంటుండగా.. మరోవైపు విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో పలువురు ఉపాధ్యాయులు ఇష్టారీతిగా వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వ పాఠశాల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ ప్రయివేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

బీర్కూరు మండలం కిష్టాపూర్ గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాల సమస్యలతో సతమతమ వుతుంది. పాఠశాల సమస్య ఎవరికి చెప్పుకోలేని దయనీయమైన పరిస్థితి నెలకొంది. గత సంవ త్సరం 170 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తు తం 150 మంది విద్యార్థులు ఉన్నారని తెలిసిం ది. గత సంవత్సరం కన్న ఈ సంవత్సరం 20 మంది విద్యార్థులు తక్కువ అయ్యారు. కారణం ఒక్కటే ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రవేట్ పాఠశాలలు ఉండడమే కారణం.

ప్రభుత్వ జీతం తీసుకుంటూనే ప్రవేట్ పనులా..?

కిష్టాపూర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధాన ఉపాధ్యాయురాలు గత రెండు రోజులుగా పాఠశాలకు రావడంలేదని అదే పాఠశాలకు చెందిన గ్రామస్తులు, విద్యార్థులు తెలిపారు. ఈ విషయంలో బీర్కూర్ హైస్కూల్ క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయుడు వెంకన్నకు వివరణ కోరగా కిష్టాపూర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధాన ఉపాధ్యాయురాలు ప్రసన్న లత సెలవు పెట్టలేదని, గత రెండు రోజులుగా విధుల్లో ఉందంటూ వివరణ ఇచ్చారు. కాని గత రెండు రోజులుగా పాఠశాలకు గైర్హాజరు అవుతూ ఆమె వ్యక్తిగత పనులు చేసుకుంటున్నారు అంటూ గ్రామస్తులు ఆరోపించారు. కిష్టాపూర్ ప్రధాన ఉపాధ్యాయురాలు బీర్కూర్ ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉన్నట్లు తెలిసింది. కొంతమంది ప్రభుత్వ టీచర్లు బినామీల పేరుతో ప్రైవేట్ స్కూల్స్ నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను పెంచాల్సిన బాధ్యతను మరచి వారికున్న పలుకుబడితో సొంత స్కూళ్లలో అడ్మిషన్లు పెంచుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి వారికి కొంతమంది రాజకీయ నాయకుల అండదండలు కూడా తోడవడంతో మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా వీరి వ్యాపారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదంతా సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవా

ఏకోపాధ్యాయ పాఠశాలలతో

సీఆర్పీలపై భారం

- ఉపాధ్యాయులు సెలవులపై వెళ్తే..
- పాఠాలు చెప్పే బాధ్యత సీఆర్పీలదే

నవతెలంగాణ-ఏర్గట్ల



ప్రాథమిక పాఠశాల భవనం

ప్రభుత్వ స్కూళ్లల్లో వసతులు మెరుగుపర్చి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. దీంతో క్రమేనా ప్రభుత్వ స్కూళ్లల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయి. అయితే ఏర్గట్ల మండలంలో పలు ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండగా.. ఆయా స్కూళ్లల్లో సదరు ఉపాధ్యాయులు సెలవులపై వెళ్లే క్రమంలో విద్యార్థులకు పాఠాలు చెప్పే బాధ్యత సీఆర్‌పీలపై పడుతోంది. వారికున్న పనులతోనే సతమతమవుతున్న సీఆర్‌పీలు.. అదనంగా విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సి రావడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఏకోపాధ్యాయులు ఉన్న స్కూళ్లను గుర్తించి మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలంలో 11 ప్రాథమిక పాఠశాలలు ఉండగా 22 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో ఇద్దరు "లో ఫీమేల్ లిటరసి"(ఎల్.ఎఫ్.ఎల్)హెచ్.ఎంలు ఏర్గట్ల ప్రైమరీ పాఠశాలలో ఒకరు, తొర్తి ప్రైమరీ పాఠశాలలో ఒకరు విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా ఏర్గట్లలోని ఎస్సీ కాలనీలో ఒకటి, తాళ్ళ రాంపూర్ వడ్డెర కాలనీ, నాగేంద్ర నగర్ లో, బట్టాపూర్ తండాలో మొత్తం నాలుగు ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. ఇద్దరు ఉన్న పాఠశాలలు 7 ఉండగా.. అందులో ఒక్కో పాఠశాలకు ఇద్దరు చొప్పున 14 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో ఏర్గట్లలోని భీంనగర్, తొర్తి, బట్టాపూర్, తడపాకల్, తాళ్ళ రాంపూర్, గుమ్మిర్యాల్ గ్రామాలకు చెందిన ప్రైమరీ పాఠశాలలు, దోంచంద లోని అప్పర్ ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయి. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలో కూడా ఒక ఉపాధ్యాయుడు అనివార్య కారణాల వల్ల పాఠశాలకు రాకపోతే పాఠశాల నిర్వహణ బాధ్యత కష్టం అవుతుంది.

ఇదిలా ఉంటే ఏకోపాధ్యాయులు, సీఆర్పీల కష్టాలు ఎలా ఉన్నాయంటే.. పాఠశాలల్లో ఒక్కరే అన్ని తరగతులకు న్యాయం చేయలేకపోతున్నారు. ఉపాధ్యాయుడు సెలవులో ఉన్నప్పుడు గాని, మీటింగ్‌కు వెళ్ళినప్పుడు గాని సదరు పాఠశాలకు సీఆర్పీలు వెళ్ళి ఆ దినమంతా పాఠాలు భోధించడంతో వారికి అదనపు భారం ఏర్పడుతుంది. అసలైతే 1వ తరగతి నుండి 5 వ తరగతి వరకు 20 మంది విద్యార్థులు ఉంటే ఒక ఉపాధ్యాయుడు, 21 నుండి 60 మంది విద్యార్థులంటే ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. మండలంలో విధులు నిర్వర్తిస్తున్న సీఆర్పీలు వారి స్వంత పనులు కాంప్లెక్స్, ఎంఆర్‌సీతో పాటు రోజుకో పాఠశాలలో పని చేయవలసి రావడంతో అధిక ఒత్తిడితో ఆందోళనకు గురవుతున్నారు. చాలీచాలని జీతంతో ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తూ.. కష్టాలు అనుభవిస్తున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) శ్రద్ధ వహించి ఏకోపాధ్యాయల, సీఆర్పీల కష్టాలు తీర్చి, మండలంలోని విద్యార్థులకు ఉన్నత విద్యనందించే దిశగా పాటుపడాలని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై ఉపాధ్యాయుల ఉద్యోగ సంఘాలు సీఆర్పీలు, ఏకోపాధ్యాయల తరవున పోరాటం చేసి వారి సమస్యను పరిష్కరించవలసిన అవసరం ఎంతైనా ఉంది. సీఆర్పీలను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి, వారికి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని చాలా కాలం నుండి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నా వారిని పట్టించుకునే నాధుడు కరువయ్యారు.

డీఎస్సీతో ఉపాధ్యాయుల భర్తీ

ఎంఈఓ ఆంధ్రయ్య వాయిస్

ఏకోపాధ్యాయ పాఠశాలల వల్ల సీఆర్పీలపై అదనపు భారం పడుతుంది వాస్తవమే. ఏర్గట్ల మండలంలో ఇద్దరే సీఆర్పీలు ఉన్నారు. ఉపాధ్యాయుడు పాఠశాలకు గైర్హాజరైతే సీఆర్పీలే విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం వచ్చే డీఎస్సి లో సరిపోయేంత మంది ఉపాధ్యాయులను కేటాయిస్తుందని నమ్మకం ఉందని. అప్పుడు సీఆర్పీల, ఏకోపాధ్యాయ పాఠశాలల బాధలు తీరుతాయి.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
నిజామాబాద్
ఆదివారం | జులై 28, 2024 | www.navatelangana.com

విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేత


ఆర్థిక సహాయం అందజేస్తున్న సుంకం భూషణ్

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన సుంకం భూషణ్ గత 7 సంవత్సరాల నుంచి బాగా చదువుతూ పేదరికం కలిగిన విద్యార్థులకు నెలనెల ప్రతి విద్యార్థినీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. శనివారం పలువురు విద్యార్థులకు 2000 చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారి ఉదార స్వభావానికి పాఠశాల తరపున ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో బోనాల పండుగ


బోనాల పండుగలో పాల్గొన్న చిన్నారులు, పెద్దలు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కులాస్‌పూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు, వారి తల్లులకు మన తెలంగాణ పండుగలు, సంస్కృతి గురించి తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జాకీరా, అంగన్వాడీ టీచర్ రజిత, ఆశాకార్యకర్తలు వినోద, సవిత, అంగన్వాడీ ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజ చేసిన్న కార్పొరేటర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ (19వ డివిజన్)లో స్థానిక కార్పొరేటర్ మీసాల సవిత శ్రీనివాస్ రావ్ ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి కార్యక్రమలకు డ్రైనేజీలు, రోడ్లు, విద్యుత్ నిర్మాణాల పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. నిజామాబాద్ పట్టణంలోని 60 డివిజన్‌లో 19వ డివిజన్ కంఠేశ్వర్‌ను ఉత్తమ డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మీసాల శ్రీనివాసరావు, పద్మశాలి సంఘం నాయకులు విజయ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ డ్రెస్ అందజేత


అందజేసిన స్పోర్ట్స్ డ్రెస్‌లతో విద్యార్థులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని చింతలూర్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆర్‌బిసిఎల్ ఫరెవర్ ఫ్రెండ్స్ స్పోర్ట్స్ డ్రెస్సులను శనివారం అందజేశారు. చింతలూరు గ్రామానికి చెందిన రఘువీర్‌గౌడ్, బాలకృష్ణ చింటూ, లింబాద్రి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్సులు దాదాపు 20 వేల విలువగల డ్రెస్సులు జడ్పిహెచ్ఎస్ స్కూల్ చింతలూరుతో 75 మంది విద్యార్థులకు ఎస్సై తిరుపతి, కొలిప్యాక్ సింగిల్‌విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతి, కొలిప్యాక్ సింగిల్‌విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్, హెచ్ఎం లచ్చన్న, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీవో

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామంలో పారిశుధ్య పనులను ఎంపీవో మహమ్మద్‌గౌస్ శనివారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగిస్తున్నామన్నారు. మురికి కాలువలను శుభ్రపరచడం, పిచ్చిమొక్కలను తొలగిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజ్యలక్ష్మి, సిబ్బంది తదితరులున్నారు.

పారిశుధ్యం నిర్వహణపై డీపీఓ అసంతృప్తి


మాట్లాడుతున్న డీపీఓ

నవతెలంగాణ-బోధన్

మండలంలోని బర్దీపూర్, లంగ్దాపూర్ గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి అయిన సీహెచ్. తరుణ్‌కుమార్ అసహనం వ్యక్తం చేశారు. శనివారం ఆయన బర్దిపూర్, లంగ్దాపూర్ గ్రామాలలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కనీసం దోమల నివారణకు చర్యలు చేపట్టకపోవడం, మురికికాలువలు అస్తవ్యస్తంగా ఉండడం చూసి ఆయన పనుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలే వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న పారిశుధ్య పనుల నిర్వహణ ఎందుకు సక్రమంగా చేయడం లేదంటూ పంచాయతి కార్యదర్శులను నిలదీశారు. గతంలో ఉన్న గ్రామ పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారినట్లు విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం బర్దిపూర్ కార్యదర్శి రెండురోజుల క్రితమే బదిలీపై వచ్చారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు ఆలస్యంగా కొనసాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్యం పనులు ఇలాగే నిర్లక్ష్యంగా కొనసాగితే సంబంధిత అధికారులపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీఓ బాల గంగాధర్, ఎంపీఓ మధుకర్, ఏపీఓ హేమలత, పంచాయతీ కార్యదర్శి సద్గుణ ఉన్నారు.

గోవూర్ స్కూల్‌కు హెచ్ఎంను నియమించాలి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-వర్ని(మోస్రా)

మండలంలోని గోవూర్ ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ యువకులు మండల విద్యాశాఖ అధికారి నాగనాథ్‌ను గోవూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోవూర్ హైస్కూల్ మాజీ చైర్మన్ నన్నేసాబ్ మాట్లాడారు.

నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

- ఇన్నోవేషన్ సెల్ కోఆర్డినేటర్ సందీప్ రాజ్
- ఆగస్టు 3వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలి
- గోడ ప్రతుల ఆవిష్కరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆవిష్కరణలకు (ఇన్నోవేషన్స్)కు ప్రోత్సాహం అందిస్తుందని ఇన్నోవేషన్ సెల్ కోఆర్డినేటర్ సందీప్ రాజ్ అన్నారు. నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని మండల కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే కమ్మర్‌పల్లిలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఇన్నోవేషన్స్ పై అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇన్నోవేషన్ సెల్ కోఆర్డినేటర్ సందీప్ రాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు ఉపయోగపడే నూతన ఆవిష్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించడమే లక్ష్యంగా ఇన్నోవేషన్ సెల్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా నలుమూలల్లో ఉన్న అన్ని గ్రామాల ప్రజలకు ఈ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు మిగతా అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా సిరిసిల్లలో నేత కార్మికులకు ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు మల్లేష్ అనే వ్యక్తి "ఆసు యంత్రాన్ని" కనిపెట్టాడని దానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం ఇచ్చి పేటెంట్ సైతం ఇప్పించిందని గుర్తు చేశారు. అదేవిధంగా మల్లేష్ కనిపెట్టిన ఆసు యంత్రానికి జాతీయ వ్యాప్తంగా గుర్తింపు ఇవ్వడంతో పాటు ఇప్పుడు అతను దేశంలోని ప్రముఖ సూక్ష్మ తరహా పారిశ్రామికవేత్తలలో ఒకరుగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందించిందన్నారు. రైతులకు రాత్రిపూట పాములు, ఇతర కీటకాలతో ఏర్పడే ఇబ్బందులను అధిగమించేందుకు విద్యార్థులు ప్లాస్టిక్ పైపుతో ఒక ఆవిష్కరణను ఏర్పాటు చేశారని ప్లాస్టిక్ పైపులో ఒక వైబ్రేటర్, మరో లైటు చిన్న బ్యాటరీతో ఈ ఆవిష్కరణ ఏర్పాటు చేసినట్టు వివరించారు. దీనిని రాత్రి పూట ఉపయోగించడం వల్ల పొలం గట్లపై వైబ్రేషన్ ఏర్పడి పాములు తేళ్ల ఇతర కీటకాలు రైతులకు కాటు వేయకుండా ఉంటాయని అదేవిధంగా వెలుతురు ఉండడం వల్ల రైతు ప్రయాణం సులభంగా సాగుతుందని గుర్తు చేశారు. ఇలాంటి ఆవిష్కరణలు ఏది ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఇందుకు ఈ ఆగస్టు మూడవ తేదీ లోపు తమ పేర్లు ఎంపీడీవో కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. దీనికోసం ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం వెబ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసిందని, అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో సంబంధిత వాల్ పేపర్స్ ఏర్పాటు చేసేలా పంచాయతీ కార్యదర్శులకు గోడ ప్రతులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇందులో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే అప్లికేషన్ వస్తుందని తెలిపారు. ఈ అప్లికేషన్‌లో గ్రామస్తులు కనిపెట్టిన ఆవిష్కరణ ఫోటోలు రెండు నిమిషాల వీడియోను అప్‌లోడ్ చేయవచ్చని, తద్వారా వారిని ఆగస్టు 15వ తేదీన జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక ప్రదర్శన శిబిరానికి ఎంపిక చేయనున్నట్టు వివరించారు. అందులో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఆవిష్కరణలకు రాష్ట్రస్థాయికి పంపనున్నట్టు తెలిపారు. అక్కడ కూడా ఎంపికైతే వారికి పేటెంట్ ఇప్పించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం రుణ సదుపాయం కల్పించి ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు. అన్ని స్థాయిల అధికారులు గ్రామాల్లో ఉన్న ఇన్నోవేటర్స్‌ను గుర్తించి స్టార్టప్‌లను, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని, పూర్తి వివరాలకు ఎంపీడీవో ద్వారా తమ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ శ్రీనివాస్, మండల తహసీల్దార్ ఆంజనేయులు, మండల పంచాయతీ అధికారి సదాశివ్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్, ఏపీఎం కుంట గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు, ఐకెపి సిబ్బంది, ఉపాధి హామీ, వ్యవసాయ శాఖ, తదితర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికారమే

సర్వ సమస్యలకూ పరిష్కారం

- హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్


అభివాదం చేస్తున్న రిటైర్డ్ న్యాయమూర్తి, బీఎల్ఎఫ్ నాయకులు

బిసి ఎస్సీ ఎస్టీ మైనారిటీ అగ్రకుల పేదలైన బహుజన ప్రజల సకల సమస్యలకు బహుజన రాజ్యాధికారం ద్వారా మాత్రమే పరిష్కారమవుతాయని రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. శనివారం నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి భూ సదస్సు జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో బిఎల్ఎఫ్ జిల్లా కన్వీనర్లు సబ్బని లత, కె.శ్రీవాస్‌ల అధ్యక్షతన జరిగిన భూ సదస్సుకు జస్టిస్ చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో బహుజన కులాల ప్రజలు 93శాతం ఉన్నారని వెల్లడించారు. 93శాతం ఉన్న బహుజన శ్రామిక ప్రజల రాజకీయ నాయకత్వంలో ఏర్పడే బహుజన రాజ్యాధికారంలో మాత్రమే బహుజన శ్రామిక ప్రజల సకల సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలవుతున్నా.. బహుజన శ్రామిక ప్రజలు ఇంకా స్వంత ఇల్లు కోసం, రేషన్ కార్డు కోసం ఉచిత బియ్యం కోసం పోరాటాలు చేసే దౌర్భాగ్య పరిస్థితికి కారణం కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలే కారణమని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా భూ సదస్సుల ద్వారా బహుజన శ్రామిక ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల పట్టాలు, ధరణి, ఇతర భూ సమస్యలపై పోరాడుతున్న బిఎల్ఎఫ్ రాష్ట్ర కమిటీని ఆయన అభినందిస్తూ బిఎల్ఎఫ్ జరిపే పోరాటాలకు తన సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం బిఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. మార్క్సిజం అంబేద్కరిజం సైద్ధాంతిక రాజకీయ ఆలోచన విధానంతో తెలంగాణలో బహుజన రాజ్యాధికారం దీర్ఘకాలిక లక్ష్యంతో ఉద్యమిస్తున్న బీఎల్ఎఫ్‌ను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్లు దండి వెంకట్, వనం సుధాకర్, నూనె వెంకటస్వామి, రాష్ట్ర నాయకులు ఎస్.సిద్ధిరాములు, బిసి సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ యాప్, ఉమ్మడి జిల్లా నాయకులు వడ్ల సాయి కృష్ణ, అబ్బగోని అశోక్‌గౌడ్, బి.జగదీష్, కె.మధు, జీజాబాయి, దండు జ్యోతి, గీతాంజలి, గంగాధర్, సాయి కాంబ్లే, జబ్బార్ నాయక్, లింగం మాల తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చుదాం


మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చుదామని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా సమితి సమావేశాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో మధ్యాహ్న భోజన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను జాతీయ స్కీం వర్కర్స్ పరిధిలో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్య పరిష్కారంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చైనా.. కేంద్ర నిధులను కలుపుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చినటువంటి హామీల ప్రకారం పదివేల వేతనం, నిత్యావసర వస్తువులను, వంట గ్యాస్ పాఠశాలలకు సరఫరా చేయాల్సిన అవసరం ఉన్నదని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.నర్సింగరావు, వై.ఓమయ్య మధ్యాహ్న భోజన పథక వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సాయమ్మ, నాయకులు సునీత, రూప, పోసాని, సుజాత, బాల్రాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రభుత్వ ఆస్పత్రికి నలుగురు వైద్యులు

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రభుత్వం నలుగురు వైద్యులను కేటాయించినట్టు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్‌రెడ్డి శనివారం తెలిపారు. ప్రజల ఆరోగ్యరీత్యా వైద్యులను కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను అంకపూర్ గ్రామంలో లాలన వృద్ధాశ్రమానికి వచ్చినప్పుడు హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో కూడా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వైద్య విధాన పరిషత్‌లో ఉన్న 100 పడకల ఆసుపత్రిని అన్ని విధాలుగా సదుపాయాలు కల్పించి ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో తీసుకురావాలని మంత్రిని ఆయన కోరారు. అలాగే ఈమధ్య జరిగిన వైద్యుల బదిలీలో ఆర్మూర్ నుంచి వైద్యులు ఇతర ప్రభుత్వ ఆసుపత్రులకు బదిలీ అయి వెళ్లారని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉన్నందున ఆ ఖాళీలను భర్తీ చేయాలని వినతిపత్రాన్ని మంత్రికి ఆయన అందజేశారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి స్పందిస్తూ ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యులను నియమిస్తూ ఆరోగ్య శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు ఇదివరకు కీళ్లు, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ అమృతరామ్ రెడ్డిని తిరిగి ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఆయనతో పాటు చాతి వైద్య నిపుణులు డాక్టర్ బల్వీర్ సింగ్, కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ స్నేహ, దంత వైద్యులు డాక్టర్ సతీష్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఉత్తర్వులు వెళ్ళినట్లు ఆయన తెలిపారు. మంత్రి వైద్యులనే కాక ఆసుపత్రికి సంబంధించిన 22 మంది స్టాఫ్ నర్సులను, ఒక సీనియర్ అసిస్టెంట్‌ను కూడా నియమించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యులకు కేటాయించినందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు తెలిపారు.

పంచాయతీ సెక్రెటరీని సన్మానించిన గ్రామ యువత


పంచాయతీ సెక్రెటరీని సన్మానించిన గ్రామస్తులు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని హుమ్నాపూర్ గ్రామ సెక్రటరీగా 5 సంవత్సరాల ఉద్యోగ కాలన్ని పూర్తి చేసుకొని బదిలీపైన రెంజల్ మండలానికి వెళ్తున్న సందర్భంగా వీడ్కోలు సమావేశంలో సెక్రటరీని సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ ప్రెసిడెంట్ గట్టు సాయిలు, రామన్న చంద్రశేఖర్, మిన్ను, ఈ.సాయిలు, వినోద్, కిష్టాగౌడ్, అసిఫ్‌ఖాన్, మహేష్, మారుతీ, నాగరాజు, గోపి, శేషరెడ్డి, కె.శివకుమార్, కారోబార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'ఊర పండగ' పాట ఆవిష్కరణ



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఊర పండగ ఔన్నత్యాన్ని, ఇందూర్ సంస్కృతి సాంప్రదాయాలను అద్దం పట్టేలా పాటను కర్క రమేష్ రచించి పాడడం అభినందనీయమని సర్వసమాజ్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ అన్నారు. 'బోనం ఎత్తింది తల్లి చూడు.. బోనం తీసింది చెల్లి చూడు.. బోనం ఎత్తింది అమ్మ చూడు.. బోనం తీసే పెద్దమ్మ చూడు..' అంటూ "ఊర పండగ ఊరంతా పండగ" అనే ఆడియో పాటను కర్క రమేష్ రచించి గానం చేయగా.. సహ గాయకులు మహేందర్, సింగరాయి పల్లి సాయిలు, చిట్టి బాబు, కోరస్ గణేష్, గోపాల్, సంగీతం మాడ బోయి ఆంజనేయులు అందించారు. ఈ పాటకు సర్వ సమాజ్ కమిటీ ఇందూరు సహకారం అందించింది. కాగా ఈ పాటను శనివారం సిర్ణపల్లి గడిలో సర్వసమాజ్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి బంటు రాజేశ్వర్, ఊర పండగ కన్వీనర్ రామ్మూర్తి గంగాధర్, కోకన్వీనర్ ఆదే ప్రవీణ్, కోశాధికారి పట్వారి కిషన్, నాయకులు నరాల రత్నాకర్, బాలకిషన్, స్వామి యాదవ్, లక్ష్మీనారాయణ, కళాకారులు ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్వ సమాజ్ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఆనాడు సిర్ణపల్లి సంస్థానాధిశురాలు శీలం జానకీ బాయి ప్రజలను ప్లేగు వ్యాధి, గత్తర నుంచి కాపాడేందుకు ప్రజల సహకారంతో పండగను నిర్వహించినట్టు తెలిపారు. ఊర పండగ చరిత్రను అందరికీ అర్థమయ్యే రీతిలో పాటను రచించి పాడిన కర్క రమేష్‌కు సర్వ సమాజ్, నిజామాబాద్ ప్రజల పక్షాన అభినందనలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బంటు రాజేశ్వర్, ఊర పండగ కన్వీనర్ రామ్మూర్తి గంగాధర్, కో కన్వీనర్ అదే ప్రవీణ్, సర్వ సమాజ్ సభ్యులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ కళాశాలలో శిక్షా సపత్ - 2024 ఉత్సవాలు



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ కళాశాలలో శిక్ష సపత్-2024 ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్‌రెడ్డి శనివారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు ఈకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ అండ్ స్కూల్ న్యూట్రిషన్ డే కార్యక్రమాన్ని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల జక్రాన్‌పల్లిలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఫుడ్ ఫెస్టివల్, రంగోలి పోటీలు, చిత్రలేఖనం పోటీలను, మొక్కలను నాటే కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ ఆహార పదార్థాలు వాటిలోని పోషక విలువలు, వాటి ప్రాముఖ్యతను ఈకో క్లబ్ సభ్యులు విద్యార్థులకు వివరించారు. అలాగే పర్యావరణంలో మొక్కల ప్రాముఖ్యతను కూడా విద్యార్థులకు వివరించారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీఈడే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్, కమ్మర్‌పల్లి, హాసకొత్తూర్, చౌటపల్లి గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో నాల్గవ శనివారం పురస్కరించుకొని పూర్వ బాల్య దశ సంరక్షణ, విద్య (ఎర్లీ చైల్డ్ హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్) దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రానికి విచ్చేసిన తల్లిదండ్రులకు చిన్నారుల ప్రతిభను గురించి వివరించారు.

ఫ్యూచర్ లైన్ కిడ్స్ పాఠశాలలో బోనాల పండుగ


బోనాల పండుగలో పాల్గొన్న విద్యార్థులు, టీచర్లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని ఫ్యూచర్ లైన్ కిడ్స్ పాఠశాలలో బోనాల పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ప్రియాంక, స్వప్న మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ మహిళ సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేసే పండుగ అన్నారు. విద్యార్థులకు తెలంగాణ సంస్కృతిక ఆచార వ్యవహారాలను ప్రతిబింబించేలా ప్రతి ఒక్క విద్యార్థి తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లత, సుమలత, గౌతమి, జమున, సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్‌కు వర్ధంతి నివాళి



నివాళ్లు అర్పిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో శనివారం అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విడీసీ అధ్యక్షులు మద్ది సూర్యకాంత్ రెడ్డి, సొసైటీ చైర్మన్ నాగర్తి భూమ్ రెడ్డి, వీడీసీ సెక్రటరీ నాగర్తి చిన్న భూమిరెడ్డి, వి డి సి ఉపాధ్యక్షులు శశికుమార్, నాగర్తి రమేష్ రెడ్డి, మోహన్ రెడ్డి, సామసాయిరెడ్డి, నాగర్తి నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కట్టుకాలువ పనులు



కొనసాగుతున్న మరమ్మతు పనులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని కట్టుకాలువ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. నాలుగు రోజుల క్రితం కట్టు కాలువ చెత్తచెదారంతో పేరుకుపోయింది. దీంతో ఇరిగేషన్ అధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో పూడికతీత పనులను చేపట్టారు. కట్టు కాలువలోని మట్టిని చెత్తను తీసివేశారు. గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి పక్కన కట్టు కాలువ ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది కలగకుండా పనులు చేపడుతున్నారు. పనులను గ్రామ కార్యదర్శి శ్రావణ్ కుమార్ పరిశీలించారు. పనులు వేగవంతంగా చేపట్టాలని ఆయన సూచించారు.

మొక్కలు నాటిన పిల్లలు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల యందు ఆరవ రోజు శిక్ష సప్తహ కార్యక్రమంలో భాగంగా ప్లాంట్స్ ఫర్ మదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పిల్లలు వారి తల్లులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచందర్, ఉపాధ్యాయ బృందం వెంకటేశం, రాములు, రాజేందర్ సిఆర్పిలు శ్రీధర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున పొలం పనులకు..

- ప్రమాదకరంగా వాగుదాటుతేనే పని
- కల్యాణివాగుపై బ్రిడ్జి కోసం ఎదురుచూపులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



కాలువలో నుంచి ప్రమాదకరంగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళా రైతులు

పంట పొలాలకు వెళ్లాలంటే రైతులు, రైతు కూలీలు ప్రమాదం అంచున ప్రయాణించక తప్పడం లేదు. మూడు గ్రామాల రైతులు శివారులోని పంట పొలాలకు వెళ్లాలంటే వాగు దాటడం సాహసంతో కూడిన పనే అవుతుంది. ఎల్లారెడ్డి మండల పరిధిలోని కళ్యాణి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న శనివారం నాడు కొంతమంది మహిళలు, రైతులు వారి వారి పంట పొలాల్లో నాట్లు వేయడానికి ప్రవహించే వాగులోంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నో సంవత్సరాల నుండి వంతెన కోసం నాయకులకు, అధికారులకు విన్నవించినా బ్రిడ్జ్ నిర్మాణం కల నెరవేరడం లేదని వాపోతున్నారు. కళ్యాణి వాగుపై వంతెన నిర్మిస్తే లింగారెడ్డిపేట్, హరిజనవాడ, కళ్యాణి గ్రామ రైతులకు, కూలీలకు ఎంతో మేలు జరుగుతుందని 3 గ్రామాల రైతులు శివారులోని పంట పొలాలకు వెళ్లడం సులువుతుందని అన్నారు. నాట్లు వేసే సమయంలో వాగు దాటడం మహిళలకు ఎంతో ఇబ్బందికరంగా, ప్రమాదంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం వంతెన నిర్మిస్తామని ఇచ్చిన హామీ నెరవేరులేదని, ఇప్పటికైనా నాయకులు, అధికారులు చొరవ తీసుకొని బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దర్జాతో.. ధ్వంసం

- రోడ్డుపై యథేచ్ఛగా తిరుగుతున్న కేజ్ విల్ ట్రాక్టర్లు



రోడ్డుపై వెళ్తున్న కేజ్ వీల్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

కేజ్ వీల్స్‌లతో ట్రాక్టర్లు రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించినా.. పలువురు లెక్కచేయకుండా దర్జాగా కేజ్ విల్ ట్రాక్టర్లను రోడ్లపై నడుపుతున్నారు. దీంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. ఎల్లారెడ్డి మండల పరిధిలోని కళ్యాణి గ్రామ ప్రధాన రోడ్డుపై శనివారం నాడు ఓ ట్రాక్టర్ యజమాని కేజ్ విల్ ట్రాక్టర్ దర్జాగా నడపడం గమనార్హం. కేజీ విల్ ట్రాక్టర్లను సీసీ రోడ్డు, బిటి రోడ్లపై నడపడం వల్ల ఆ రోడ్లు ధ్వంసం అవుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వం ఎంతో వ్యయంతో రోడ్లు వేస్తే కేజ్ విల్ ట్రాక్టర్లు తిరగడం వల్ల అవి ధ్వంసమై ప్రజాధనానికి తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు రోడ్లపై కేజ్ విల్ ట్రాక్టర్లు నడిపే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గోలి లింగాల్‌లో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని గోలి లింగాల గ్రామంలో శనివారం గ్రామస్తులు పోచమ్మ, దుర్గమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. ప్రతి సంవత్సరం లాగే ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివకుమార్, సంజీవులు, రామస్వామి, లింగాగౌడ్ తోపాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌ఓసి అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని 38 వార్డు శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన పగడాల శంకర్ ఇటీవల ప్రమాదవశాత్తు పడడం వలన తలలో రక్తం గడ్డ కట్టడం తో ఆసుపత్రిలో చేరారు. ఆస్పత్రి ఖర్చులకోసం వారి వద్ద డబ్బులు లేకపోవడంతో శస్త్ర చికిత్స కోసం అతడి కుటుంబీకులు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ని సంప్రదించడంతో సీఎంఆర్ఎఫ్ కింద ఎల్వోసీ మంజూరు చేయించారు. ఈమేరకు శనివారం రూ.2.5 లక్షల ఎల్వోసీని హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధిత కుటుంబీకులకు షబ్బీర్ అలీ అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పద్మశాలి పట్టణ సంఘం అధ్యక్షులు చాట్ల రాజేశ్వర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్ బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాసవి పబ్లిక్ స్కూల్లో బోనాల పండుగ



బోనాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వాసవి పబ్లిక్ స్కూల్లో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు పాఠశాల ప్రైమరీ స్కూల్ విద్యార్థులచే బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు బోనాల పండుగకు అనుగుణంగా వస్త్రాధారణ చేసుకొని బోనాలతో అమ్మవారికి నైవేద్యాలను సమర్పించే కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయమైన బోనాల పండుగను ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉంది అని, విద్యార్థులకు ఇప్పటినుండి తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను మరచిపోకుండా వాటిని పాటించే విధంగా తయారు చేయడం, విద్యార్థులను చక్కటి సాంప్రదాయ దుస్తుల్లో చూడటం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు పోలీస్ స్టేషన్లో చట్టాలపై అవగాహన శనివారం కల్పించారు. పోలీస్ స్టేషన్ ఎస్సై గది లాకప్ గది తదితర అంశాలపై విద్యార్థినిలకు పోలీస్ శాఖ చట్టాల గురించి అవగాహన కల్పించారు. లాక్ అప్‌లో ఎటువంటి వారిని వేస్తారు అనే దానిపై అవగాహన కల్పించారు. చట్టాల గురించి ప్రతి ఒక్కరికి తెలియాలని పోలీస్ స్టేషన్‌లో తెలియజేశారు. పోలీస్ స్టేషన్, పలు ప్రభుత్వ కార్యాలయాలను తీసుకువెళ్లి విద్యార్థినిలకు శాఖల పరంగా అవగాహన కల్పించారు.

వర్షాల పట్ల అలర్ట్‌గా ఉండాలి

- ఎంపీడీవో రాణి



మట్లాడుతున్న ఎంపీడీవో రాణి

నవతెలంగాణ-మద్నూర్

భారీ వర్షాల మూలంగా ప్రతి గ్రామంలో గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని గ్రామ కార్యదర్శిలకు ఎంపీడీవో రాణి ఆదేశాలు జారీ చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎండి ముజీబ్, డోంగ్లి తహసీల్దార్ రేణుక చౌహన్, పంచాయతీరాజ్ ఏఈ, ఇరిగేషన్ శాఖ ఏఈ, ఉపాధి హామీ ప్రోగ్రాం అధికారి, డోంగ్లి మండలాల గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు. సమావేశంలో భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు అంతా అలర్ట్‌గా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో పురాతనమైన ఇండ్లు కూలిపోయిన వాటి గురించి సమాచారం సేకరించాలని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు పరిశుభ్రత పట్ల గ్రామంలో రోడ్ల వ్యవస్థ నీటి ట్యాంకుల శుభ్రత ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టితో చేపట్టాలని గ్రామ కార్యదర్శులకు ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు.

వెటర్నరీ వైద్యుడిగా రవికుమార్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల వెటర్నరీ ఆస్పత్రి వైద్యుడిగా డాక్టర్ రవికుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. లింగంపేట్ వెటర్నరీ ఆసుపత్రిలో విధులు నిర్వహించిన రవికుమార్ బదిలీపై నాగిరెడ్డిపేట్‌కు వచ్చినట్లు ఆయన తెలిపారు. తాండూర్ (ఎస్‌సిఎహెచ్) వెటర్నరీ సెంటర్లో అసిస్టెంట్ సర్జన్‌గా డాక్టర్ అరుణ్ కుమార్ విధుల్లో చేరినట్లు రవికుమార్ తెలిపారు.

విద్యార్థిని ఉన్నతచదువులకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-పిట్లం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న లయన్స్ క్లబ్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఈసెట్ ఫలితాలలో ర్యాంకు సాధించిన కుమారి వైష్ణవి కన్వీనర్ కోటాలో సీటు సంపాదించడం పట్ల మండల లైయన్స్ ఆధ్వర్యంలో ఒక లక్ష 15 వేల రూపాయల చెక్కును లయన్స్ రాష్ట్ర నాయకులు సంజీవరెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇనిస్ట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ దండిగల్‌లో సిఎస్సి (ఏఐఎంఎల్) కన్వీనర్ కోటాలో సీటు సాధించిన కుమారి వైష్ణవికి స్థానిక లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో హాస్టల్ ఫీజు నిమిత్తం ఒక లక్ష 50 వేల రూపాయల చెక్కు అందజేసినట్టు తెలిపారు. వైష్ణవిని లైన్స్ క్లబ్ దత్తత తీసుకొని ఆర్మూర్ లోని క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజీలో పాలిటెక్నిక్ మూడు సంవత్సరాల హాస్టల్ ఫీజు నిమిత్తం ఒక లక్షా 35 వేల రూపాయలను అందించినట్టు తెలిపారు. ఇటీవల ఈ సెట్ ఎంట్రన్స్ ఫలితాలలో 2157 ర్యాంకు సాధించి కన్వీనర్ కోటాలో సీటు సంపాదించడం హర్షనీయమన్నారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి ఉద్యోగంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఒక నిరుపేద విద్యార్థినికి లయన్స్ క్లబ్ చేయూత నివ్వడం పట్ల అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షులు కాశిరెడ్డి , కార్యదర్శి వేణుగోపాల్ , సభ్యులు రజిని , లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు అభినందన

నవతెలంగాణ-కామారెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న జైపాల్‌రెడ్డి

తెలంగాణ యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ ఫలితాలలో మంచి మార్కులు సాధించిన ఎస్ఆర్‌కే విద్యార్థులను ఆర్కే గ్రూప్ ఆఫ్ కరస్పాండెంట్, సీఈవో డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి శనివారం సన్మానించారు. మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మన దేశంలో డిగ్రీ పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థి ప్రతి ఉద్యోగానికి అర్హులు కాబట్టి ప్రతి ఒక్కరు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవ్వాలని మీకు ఉన్న లక్ష్యాన్ని సాధించేవరకు కష్టపడాలని, మీరు తీసుకొచ్చిన రిసల్ట్ కళాశాలకు అలాగే మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్నటువంటి పోటీ కాలంలో ప్రతి ఒక్కరు ఇష్టంగా కష్టపడి చదవాలని ఇప్పటి నుండే కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కి ప్రిపేర్ అవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఫోర్త్ సెమిస్టర్ లో కె భవాని 9.72 జీపీఏ బిటిబిసి, ఫోర్త్ సెమిస్టర్ సిహెచ్ మానస 9.64 జీపిఎ ఎంఎస్టిడిఎస్, డి మనీషా 9.60 జీపిఎ బిటిబిసి సెకండ్ సెమిస్టర్, సిహెచ్ భావన 9.47 బిటిబిసి సిక్స్ సెమిస్టర్, ఎస్ నిఖిత 9.44 జీపిఎ, ఎస్ రక్షిత 9.44 జీపిఏ, సాత్విక తదితరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ దత్తాత్రి, మధుసూదన్ రెడ్డి,తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,బాల్ రెడ్డి,దత్తుకుమార్ పాల్గొన్నారు.

31న చలో హైదరాబాద్‌కు తరలుతున్నాం

- ఎంఈఓకు మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమం తల పెట్టామని,ఈ నెల 31వ తారీఖు నాడు ఎల్లారెడ్డి మండల మధ్యాహ్న భోజన వంట కార్మికులంతా పాఠశాలలో వంట పనులు నిలిపి వేస్తున్నామని శనివారం నాడు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎంఇఓ కార్యాలయంలో ఎంఈఓ వెంకటేశంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 72201 మంది మధ్యాహ్న భోజన నిర్వాహక కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని, ఎన్నికల సమయంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంకా పరిష్కారం దిశగా అడుగులు వేయడం లేదని, సకాలంలో బిల్లులు రాక అప్పులు తెచ్చి మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మధ్యాహ్న భోజన నిర్వహణ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భోజనం వంట కార్మికులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైగా మహేందర్

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



బాధ్యతలు చేపడుతున్న ఎస్సై

పెద్దకొడప్‌గల్ మండలం పోలీస్ స్టేషన్లో పనిచేసిన ఎస్సై కొండారెడ్డి కామారెడ్డి జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ కాగా కామారెడ్డి సీసీఎస్‌లో పనిచేసిన మహేందర్ పెద్దకొడప్‌గల్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు ఆటంకాలు కలగకుండా అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటానని మండల ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు.

బదిలీపై వెళ్తున్న కార్యదర్శులకు సన్మానం

నవతెలంగాణ-సదాశివనగర్



మాట్లాడుతున్న ఎంపీడీఓ సంతోష్ కుమార్

సదాశివనగర్ మండల గ్రామ పంచాయతీల అభివృద్ధి లక్ష్యంగా పంచాయతీ కార్యదర్శులు పనిచేశారని సదాశివనగర్ ఎంపీడీఓ సంతోష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శులు దేవిసింగ్ (ఉత్తనూర్), స్వరూప (లింగంపల్లి), సౌమ్య(జనగాం), నరేష్ కుమార్(తీర్మన్ పల్లి), విజయ(కుప్రియల్) లను మండల పంచాయతీ కార్యదర్శిల అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ఏ పంచాయతీకి వెళ్లినా సమయపాలన పాటిస్తూ అంకితభావంతో పనిచేసి మంచి గుర్తింపు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సురేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిన్నారికి అండగా నిలిచిన విజ్ఞాన్ పాఠశాల

నవతెలంగాణ-భిక్కనూర్



మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై బ్రెయిన్‌డెడ్‌తో మరణించిన ప్రవీణ్ కూతురు చిన్నారి ఉద్విత‌కి భిక్కనూరు పట్టణంలోని విజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ విజయ భాస్కర్ రెడ్డి అండగా నిలిచారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రవీణ్ కూతురు ఉద్విత విజ్ఞాన్ పాఠశాలలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఉచిత విద్యను అందించనున్నట్లు తెలిపారు. చిన్నారి చదువుకు పూర్తి బాధ్యత చూసుకుంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. పెద్ద మనసుతో ముందుకు వచ్చి ప్రవీణ్ కుటుంబాన్ని ఆదుకున్నందుకు సిద్ధ రామేశ్వర ట్రస్ట్ సభ్యులకు ప్రవీణ్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సంతోష్, సురేష్, రవి, నరేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎంపీడీవో

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మహమ్మదాబాద్ గ్రామంలోని వైకుంఠ ధామంలో వనమహోత్సవంలో భాగంగా ఎంపీడీవో శ్రీనివాస్ మొక్కలు నాటినట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి జీవన్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామాలలో రోడ్ల వెంట ఖాళీ స్థలంలో, ప్రభుత్వ భూములలో మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేయాలన్నారు. మానవ మనుగడకు వృక్షాలు చాలా అవసరమని, గ్రామంలో ప్రతి ఒక్కరూ ఆరు మొక్కలు నాటే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమాలలో గ్రామస్తులను భాగస్వాములు చేయాలని జీపీ కార్యదర్శి జీవన్‌ను ఆదేశించారు. గ్రామంలో చెత్తచేదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసి శానిటేషన్ చేయాలని పేర్కొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని మైలరం గ్రామంలోని సహకార సంఘం భవనంలో శనివారం మాజీ మార్కెట్ కమిటీ, మాజీ సొసైటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్ చేతుల మీదుగా డబుల్ బెడ్ రూం లబ్దిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సొసైటీ అధ్యక్షుడు పెరిక శ్రీనివాస్ మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గంలో మైలారం గ్రామం అంటే తెలంగాణ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఎంతో ఇష్టమన్నారు. గ్రామంలో సుమారు 40 డబుల్ బెడ్ రూమ్‌లు మంజూరు చేయగా అందరూ లబ్దిదారులు ఇల్లు కట్టుకున్న వారికి విడతల వారీగా బిల్లులను పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ సాయికుమార్, మాజీ మండల ఉపాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి మాజీ ఎంపిటిసిలు మహేందర్, చంద్ర గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నిండు ప్రాణాల్ని నిలబెట్టేదే సీపీఆర్



మాట్లాడుతున్న మండల మెడికల్ ఆఫీసర్ రోహిత్

నవతెలంగాణ- నిజాంసాగర్

నిండు ప్రాణాల్ని నిలబెట్టేది సీపీఆర్ (కార్డియోపల్మనరి రీసస్టియేషన్) అని నిజాంసాగర్ మండల మెడికల్ ఆఫీసర్ రోహిత్ అన్నారు. శనివారం ఏపీజే అబ్దుల్ కలాం మెమొరీ నేషనల్ సిపిఆర్ పునర్జన్మ దినోత్సవ సందర్భంగా ఆయన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరికి ఉన్నట్టుండి గుండె ఆగిపోతూ ఉంటుందని, దానిద్వారా శరీరంలోని మిగతా అర్గాన్లు అన్ని కూడా ఆగిపోతూ ఉంటాయని తెలిపారు. అప్పుడు సిపిఆర్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. స్పృహ తప్పి పడిపోయిన వారికి ఐదు నిమిషాలలో సిపిఆర్ గనక చేస్తే ఆ ప్రాణం నిలబడుతుందని చెప్పారు.

సిపిఆర్ చేసే ముందు కొన్ని జాగ్రత్తలు తప్పకుండా పాటించాలని సూచించారు. ముందుగా స్పృహ తప్పిన వారిని నేలపైన ఫ్లాట్ గా పడుకోబెట్టి వారి గుండె కొట్టుకుంటుందా లేదా అని ముందుగా చెక్ చేసినా తర్వాతే సిపిఆర్ చేయాలని ఆయన అవగాహన సదస్సులో తెలిపారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి గంగాధర్, మండల రెవెన్యూ శాఖ సిబ్బంది, పోలీస్ శాఖ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

- స్కూల్‌ను సందర్శించిన ఎంపీవో



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీవో రాము

నవతెలంగాణ-జుక్కల్

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని ఎంపీవో రాము సూచించారు. మండలంలోని బంగారు పల్లి గ్రామములోని ఎంపిపిఎస్ పాఠశాలను, అభివృద్ధి పనులను శనివారం ఎంపీవో ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. మొదటగా పాఠశాలలోని నిర్మించిన పనులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. సమయ పాలన పాటించాలని హెచ్ఎం రాజేందర్ అప్పాను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను, రికార్డులను పరిశీలించి, నిత్యం పిల్లలకు, గర్భిణిలకు, బాలింతలకు పాలు, గుడ్లు, బాలమృతం అందించాలని టీచర్ మంగళ బాయిని ఆదేశించారు. గ్రామంలో శానిటేషన్ పనులను దగ్గరుండి శుభ్రం చేయించారు. పల్లె ప్రకృతి వనం సందర్శించి మొక్కలు ఏపుగా పెరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పారిశుధ్యం పనులు పరిశీలన



పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేష్

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామాలలో శనివారం పారిశుధ్య పనులను ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. మండలంలోని పోతాయపల్లి కోమటిపల్లి కన్నాపూర్ పోల్కంపేట్ గ్రామాలలో పారిశుధ్య పనులను పరిశీలించారు. రోడ్లపై నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. చెత్త చెదరం ఉన్నట్లయితే దోమలు వ్యాపించి ప్రజలు రోగాల బారిన పడతారన్నారు. అదేవిధంగా వెంటనే నీటి గుంతలు పూడ్చి నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దోమ మందులను పిచికారి చేయాలన్నారు. మురికాలువలో కుళాయిల వద్ద బ్లీచింగ్ పౌడర్ వేయాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి అశ్వక్, క్షేత్ర సహాయకులు కుమార్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గోర్తి ఈశ్వర ట్రస్ట్ ద్వారా విద్యార్థినికి ఆర్థికసాయం అందజేత



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మోపాల్ మండలంలోని సిరిపూర్ గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గోర్తీ ఈశ్వర ట్రస్ట్ ద్వారా ట్రస్టు వ్యవస్థాపకులు శ్రీమతి ఉషాబాలా పవన్ కుమార్ ఆర్థిక సహకారంతో ట్రస్టు ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్ గ్రామానికి చెందిన పాటుకూరి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల టాపర్ కుమారి సంధ్యకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ముత్యంరెడ్డి, గ్రామస్తులు సంజీవరెడ్డి, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపీడీవో



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ సందర్శించి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థుల కోసం ఆహార పదార్థాలను తయారు చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున ఈగలు ఎక్కువగా ఉంటాయని వండిన ఆహార పదార్థాలపై తప్పనిసరిగా మూతలు పెట్టి ఉంచాలన్నారు. వర్షాకాలంలో పరిశుభ్రతను పాటించాలని, పిల్లలకు శుభ్రమైన ఆహారాన్ని రుచికరంగా అందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో అదనపు సెక్షన్ మంజూరుపై ఎంపీ హర్షం

- కొనసాగుతున్న ఎంపిక ప్రక్రియ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేంద్రీయ విద్యాలయంలో 1వ తరగతిలో అదనపు సెక్షన్ మంజూరుకై సహకరించాలని, గత రెండు నెలల క్రితం వీఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంపీ అర్వింద్‌ను కోరడం, ఆ వెంటనే అదనపు సెక్షన్ మంజూరికై అనుమతులు ఇవ్వాలని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని కోరిన సంగతి తెలిసిందే. ఈ విజ్ఞప్తిపై మంత్రి, కేంద్రీయ విద్యాలయ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి 1వ తరగతిలో అదనపు సెక్షన్ మంజూరుకు ఇటీవల అనుమతి ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో సంబంధిత విద్యాలయ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేసి, అడ్మిషన్ల ప్రక్రియని మొదలుపెట్టారు. అడ్మిషన్ల కొరకు మొత్తం 132 దరఖాస్తులు స్వీకరించామని, కేంద్రీయ విద్యాలయ నియమ నిబంధనలకు అనుగుణంగా ఈనెల 22వ తేదీన లాటరీ పద్ధతిన అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించామన్నారు. ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రస్తుతం కొనసాగుతుందని, మరో వారం రోజుల్లో తరగతులు ప్రారంభమవుతాయని విద్యాలయ అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వృద్ధురాలు



చికిత్స పొందుతున్న వృద్ధురాలు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

గత నాలుగు రోజుల క్రితం మల్లారం అటవీ ప్రాంతంలో మాట్లాడే స్థితిలోలేని గుర్తు తెలియని వృద్ధురాలు (75) కనబడటంతో గ్రామస్తులు ఆమెను నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. కావున ఈమెను ఎవరైనా గుర్తిస్తే నిజామాబాద్ రూరల్ ఎస్సై మహేశ్‌ను సంప్రదించాలని పోలీసులు సూచించారు. 8712659849 నెంబర్‌ను ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

పిల్లలకు ఆటపాటలతో పాటు విద్యా ఎంతో అవసరం

- ప్రాజెక్టు ఆఫీసర్ జ్యోతి



ఈసీసీఈ డేలో పాల్గొన్న ప్రాజెక్టు ఆఫీసర్ సిడిపిఓ జ్యోతి

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్‌నగర్ గ్రామంలో గల అంగన్వాడీ సెంటర్‌లో ఈసీసీఈ డేను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్మూర్ ప్రాజెక్టు ఆఫీసర్ సిడిపిఓ జ్యోతి, అంగన్వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ప్రతి నెల 4న శనివారం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వారు పూర్వ బాల్యారంభ దశ దాని ప్రత్యేకతను వివరించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలు చేసే స్వేచ్ఛ డ్రాయింగ్ ప్రత్యేకత, రన్నింగ్ బ్లాక్ బోర్డ్ ఉపయోగాలు, పోర్ట్ పోలియో బ్యాగ్ గురించి దానిలో పిల్లలకు సంబంధించిన, ఆ పిల్లలు వేసిన డ్రాయింగ్స్, రంగులు వద్దడం గ్రోత్‌కార్డ్, అసెస్‌మెంట్ కార్డ్స్ పిల్లల తల్లులకు చూపించారు. పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యత గురించి పిల్లలకు ఆటపాటలతో విద్య ఎంత అవసరమో అనేది తల్లులందరికీ వివరించారు. కార్యక్రమంలో ఆర్మూర్ సిడిపిఓ జ్యోతి, సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్వాడీ టీచర్లు జె.గాయత్రి, టి.రాజమణి, ఆయాలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను, సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జంగం గంగాధర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

గ్రాపంచాయతీ కార్మికులతో పాటు సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని సిఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జంగం గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చలో హైదరాబాద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, వేతనాల పెంపు, బకాయి వేతనాలను మంజూరు చేయాలని అన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని తెలిపారు. జిల్లాలో సుమారు 2700 మంది గ్రామ పంచాయతీలలో పారిశుధ్య పనులు చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. కార్మికులందరికీ ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని అన్నారు. ఈనెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పారిశుధ్య కార్మికులతో పాటు జీపీ సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జంగం గంగాధర్, రాష్ట్ర నాయకురాలు జోగ్గరి పద్మ గరిగింట్ల శ్రీనివాస్, కుంట సంతోష్, ప్రవీణ్, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారిని ప్రాణాపాయం బారి నుంచి కాపాడేందుకు ఎంతగానో ఉపకరించే సీపీఆర్ నిర్వహణ విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సూచించారు. శనివారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులు, వివిధ వర్గాల వారికి సీపీఆర్ శిక్షణ ఆవశ్యకతపై జిల్లా కార్యాలయాల సముదాయంలో పునర్జన్మ పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం మాట్లాడుతూ.. అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారిని గమనించిన వెంటనే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సీపీఆర్ ప్రక్రియను అమలు చేయాలని సూచించారు. ఆహారపు అలవాట్లు, మారిన జీవనశైలి వంటి అనేక కారణాల వల్ల ప్రస్తుతం అనేకమంది ఆకస్మికంగా గుండెపోటుకు గురవుతున్నారని తెలిపారు. సీపీఆర్ టెక్నిక్స్ తెలుసుకున్న వారు, ఒక్కొక్కరు మరో పది మందికి నేర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీడబ్ల్యుఓ రసూల్ బీ, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగూరావ్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న పలువురు

విద్యారంగానికి తీవ్ర అన్యాయం

- విద్యాశాఖకు మంత్రిని నియమించాలి
- ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-బోధన్

ప్రజా పాలనలో విద్య రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ డిమాండ్ చేశారు. శనివారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ మధుమలాంచ జూనియర్ కళాశాల వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖకు ప్రభుత్వం ఇంతవరకు మంత్రి పదవిని ఎవరికి కేటాయించలేదని కావున విద్యారంగ సమస్యలు పరిష్కరించడానికి తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.3శాతం బడ్జెట్ కేటాయించిందని, ఇది గత ఓటాన్ బడ్జెట్లో కేటాయించిన బడ్జెట్ కంటే తక్కువ అని అన్నారు. గత బడ్జెట్లో విద్యారంగానికి 21,389 కోట్ల రూపాయలు కేటాయించిందని, అది ప్రస్తుతం 21,292 కోట్లు కేటాయించారని అన్నారు. నామమాత్రపు నిధులు కేటాయించడం సిగ్గు చేటన్నారు. అలాగే ప్రభుత్వ హాస్టల్లో అభివృద్ధి కోసం మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులను పెంచాలని, దాంతోపాటు విద్యా శాఖకు మంత్రిని నియమించాలని అన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి బోధన్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బోధన్ నాయకులు ఓంప్రసాద్, సాయి, అవెస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విఘ్నేశ్

పాఠశాలల్లో బోనాల సంబరాలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో గల జెంటిల్ కిడ్స్, స్మైల్, శ్రీ చైతన్య పాఠశాలల్లో బోనాల పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు శివసత్తులు, పోతరాజు వేషధారణలో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ లతా బోనాల పండుగ ప్రాముఖ్యతన గ్రామ దేవతల గురించి పిల్లలందరికీ చక్కగా వివరించారు. కరస్పాండెంట్ లయన్ ప్రకాష్ గుజరాతి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర పండుగగా అభివర్ణించారు. ఈ కార్యక్రమాన్ని అందరూ నిర్వహించుకోవాలని తెలిపారు. పండుగ విశిష్టతను పిల్లలకు తెలియజేశారు. కార్యక్రమంలో పిల్లలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మైల్ పాఠశాలలో..

స్మైల్ పాఠశాలలో స్మైల్స్ ద స్కూల్ ప్రాంగణంలో బోనాలు పండగ నిర్వహించారు. పిల్లలందరూ సాంప్రదాయంగా దుస్తులు ధరించి అందరిని ఆకట్టుకున్నారు. పాఠశాల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు బోనాలను ఎత్తుకొని ఐదు చేతుల పోచమ్మ వద్దకు వెళ్లారు. దేవతకు బోనాలను సమర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ షబానా గౌహర్, స్టాఫ్ సరిత, సవిత, సింధూర, సింధుజ, స్వప్న, శ్వేత, రోజా, శ్రావణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు. డైరెక్టర్ రఫీ గౌహర్ మాట్లాడుతూ.. మన సాంప్రదాయం బోనాల గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో సైతం బోనాల సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



బోనాల సంబరాలు జరుపుకున్న విద్యార్థులు

విద్యాభివృద్ధిలో వెనుకబడ్డ నిజామాబాద్

- టీజీవీపీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యాభివృద్ధిలో వెనుకబడ్డ నిజామాబాద్ వెనుకబడిందని టీజీవీపీ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్ తెలిపారు. శనివారం తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ విశ్వవిద్యాలయాన్ని పట్టించుకునే నాథుడే లేడన్నారు. మొన్నటి వరకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మొసలి కన్నీరు కార్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు నిమ్మకునీరెత్తినట్టు వ్యవరిస్తున్నారని వివరించారు. ఇంచార్జ్ వీసీతో కాలం వెల్లదీస్తున్నారని తెలిపారు. తెలంగాణ పేరుతో సాధించుకున్న తెలంగాణ యూనివర్సిటీని గత పది సంవత్సరాలుగా పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్నచూపు చూసిందని, పక్కా జిల్లాలకు ఇంజనీరింగ్, మెడికల్, వెటర్నరీ కాలేజ్‌లు మంజూరు చేసినా.. నిజామాబాద్ జిల్లా మాత్రం వెంకబడిపోయిందన్నారు. తక్షణమే నిజామాబాద్ జిల్లాకు ఇంజనీరింగ్, మెడికల్, అగ్రికల్చర్, వెటర్నరీ కాలేజీలను మంజూరు చేయాలని తెలిపారు. లేకపోతే త్వరలోనే నిజామాబాద్ జిల్లా విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం పెట్టి తదుపరి కార్యాచరణ తీకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అనిరుధ్, వినయ్, నాయకులు మహేష్, గంగాధర్, రాజు, సర్వేశ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీజీవీపీ నాయకులు

సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

నవతెలంగాణ-బాల్కొండ

వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, డయేరియా వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాల,మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో శనివారం డాక్టర్ స్రవంతి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలలో, కాలేజీలో కలియ తిరుగుతూ వంట గదులు పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు తప్పనిసరిగా శుభ్రత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మురళి, హెల్త్ సూపర్వైజర్ వాణి, హెల్త్ అసిస్టెంట్ రాజు, ఆశ వర్కర్ మాధురి, కేజీబీవీ ప్రత్యేక అధికారిని గరిగె భవాని, కళాశాల లెక్చరర్లు, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన బాల గంగాధర్



నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం చేపట్టిన అధికారుల బదిలీలలో భాగంగా బోధన్ మండలానికి ఎంపీడీఓగా బాలగంగాధర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. బాలగంగాధర్ ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం నుండి బోధన్ కు బదిలీ పై వచ్చారు. బోధన్ ఎంపీడీఓగా పని చేసిన వెంకటేష్ జాధవ్ రెంజల్ మండల ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు.

డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-సిరికొండ

అణు వైజ్ఞానిక రంగంలో విప్లవాత్మక మార్పులతో భారత ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన అపరమేధావి, దేశం గర్వించే శాస్త్రవేత్తగా, విద్యావేత్తగా, రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య అన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, భారతరత్న, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే (అవుల్ పకీర్ జైనులబ్దిన్) అబ్దుల్ కలాం, 9వ వర్ధంతిని సత్యశోధక్ పాఠశాలలో నిర్వహించారు. మొదటగా ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య అబ్దుల్ కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి మహనీయునికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. ఒక మారుమూల గ్రామం నిరుపేద కుటుంబంలో జన్మించి, నిరాడంబర జీవితంతో క్షిపణి పితామహుడుగా, దేశ ప్రథమ పౌరుడి స్థాయికి ఎదిగిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. వినూత్న ఆలోచనలతో భారతదేశాన్ని క్షిపణి తయారులలో ప్రపంచ అగ్రదేశాల సరసన నెలబెట్టిన బహుముఖ ప్రజ్ఞశాలి అని అన్నారు. 'కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి' అంటూ యువతలో స్ఫూర్తిని నింపుతూ మిస్సైల్ మ్యాన్‌గా ప్రసిద్ధికెక్కిన అబ్దుల్ కలాం స్ఫూర్తితో నేటి యువత, విద్యార్థులు దేశ ఔన్నత్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలో నేడు(ఆదివారం) బోనాల పండుగను పురస్కరించుకొని నిజామాబాద్ నగరంలో పలు ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. నిజామాబాద్ ప్రజలు ట్రాఫిక్ మళ్లింపును గమనించాలని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఊరపండగ సందర్భంగా ముఖ్యంగా ఊరేగింపు ఖిల్లా చౌరస్తా నుంచి సిర్నాపల్లి గడి (గోల్ హనుమాన్), వినాయక్‌నగర్, దుబ్బా (జిజి కాలేజ్) వరకు పలుమార్గాలలో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని పేర్కొన్నారు.

బోధన్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు అర్సపల్లి, న్యూ కలెక్టరేట్, జీజీ కాలేజ్, ఫ్లైఓవర్, మీదుగా బస్టాండ్ చేరుకోవాలని, భారీ వాహనాలు న్యూ కలెక్టరేట్ బైపాస్ మీదుగా మాధవ్‌నగర్ వెళ్లాలని తెలిపారు. బస్టాండ్ నుంచి బోధన్ వెళ్లే ఆర్టీసీ బస్సులు రైల్వే స్టేషన్, గ్లామర్, గాంధీచౌక్, నెహ్రూ పార్క్, బోధన్ బస్టాండ్ మీదుగా వెళ్లాలని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి బోధన్ వెళ్లే వాహనాలు మాధవ్‌నగర్ బైపాస్, న్యూ కలెక్టరేట్, అర్సపల్లి మీదుగా వెళ్లాలని వివరించారు. ఖిల్లా చౌరస్తా నుంచి సిర్నాపల్లి గడి (గోల్ హనుమాన్) మార్గంలో వెళ్లేవారు వేరే మార్గాల నుంచి వెళ్ళాలని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తూ తమ ప్రయాణాలు జరుపుకోవాలని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి

- ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నారాయణ



మాట్లాడుతున్న ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నారాయణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ట్రాఫిక్ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నారాయణ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పిఎస్ ఆవరణలో వివిధ కళాశాలలకు సంబంధించిన ప్రిన్సిపాల్స్, స్కూలుకు సంబంధించిన హెడ్మాస్టర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైనర్ పిల్లలు ఎవరైనా బైక్ మీద వస్తే రానివొద్దని అన్నారు. పేరెంట్స్ మీటింగ్ కండక్ట్ చేసినప్పుడు స్పష్టంగా పిల్లల తల్లిదండ్రులకు చెప్పాలని, అందరూ విధిగా బైక్ నడిపే వారు హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. కార్యక్రమానికి ట్రాఫిక్ ఏసిపి టి.నారాయణ, ట్రాఫిక్ సిఐ వి.వెంకటనారాయణ, బోధన్ ట్రాఫిక్ సిఐ చందర్‌రాథోడ్, ఎస్సై రహమతుల్లా, ఆర్ఎస్ఐ సుమన్, చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

వనమహోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలి

- చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత



మొక్కలను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్

నవతెలంగాణ-భీంగల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత తెలిపారు. శనివారం పట్టణంలోని 6,7,8,10 వార్డులలో ఇంటింటికి మొక్కలను మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రేమలత, కమిషనర్ రామకృష్ణ, వార్డ్ కౌన్సిలర్లతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గున్నాల బాలభాగత్, వార్డ్ కౌన్సిలర్లు సిహెచ్ గంగాధర్, సతీష్‌గౌడ్, తుమ్మ భూదేవి ముత్తన్న, ఖైరున్నిసా బేగం, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు, పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | జులై 28, 2024 | www.navatelangana.com

అథ్లెటిక్ క్రీడాకారుడికి ఆర్థిక సహాయం అందజేత



నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా కేంద్రానికి చెందిన జాతీయ స్థాయిలో రాణిస్తున్న నిరుపేద అథ్లెటిక్ క్రీడాకారుడు అజయ్ మరింత మెరుగైన ప్రదర్శన కోసం శిక్షణ పొందడానికి ఆర్థిక ఇబ్బందులతో దాతల కోసం ఇజ్రాయెల్ తెలంగాణ అసోసియేషన్ మహేష్‌గౌడ్‌ను శనివారం సంప్రదించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ బోర్డు మెంబర్ ఎల్లా ప్రసాద్ (సిరిసిల్ల) రూ.20వేలు తెలంగాణ అసోసియేషన్ బోర్డ్ తరఫున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సహాయాన్ని పట్టణంలోని నలంద పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్ తదితరులు అందజేశారు.

నవీన్ హైస్కూల్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు



నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని నవీన్ హైస్కూల్ ఆధ్వర్యంలో శనివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయులు బోనాలతో ఊరేగింపుగా పట్టణంలోని దాస్ హనుమాన్ గల్లీ, బజార్, నడిమిగల్లి, పోచమ్మగల్లీ పురవీధుల కుండా పెద్ద పోచమ్మ తల్లి మందిరానికి వెళ్లి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుల నరేందర్, ఇంచార్జ్ శ్రీకాంత్, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధ్వాన్న స్థితిలో రోడ్డు



బురదమయంగా మారిన రోడ్డు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి హనుమాన్ మందిరానికి ఎదురుగా ఉన్న గుంతలలో నీరు నిలవడంతో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మామిడిపల్లి నుంచి రైల్వే స్టేషన్ వెళ్లే మార్గంలో రోడ్లపై గుంతలలో నీరు నిలిచింది. వర్షాకాలంలో ఇటువైపుగా వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు శనివారం తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

జిపి బిల్ కలెక్టర్‌కు, ఏఎన్ఎంకు సన్మానం



సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ బదిలీపై వచ్చిన బిల్ కలెక్టర్ శోభకు, ఏఎన్ఎం అనురాధకు గ్రామస్తులు గ్రామ పంచాయతీలో శనివారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ శోభ నిజామాబాద్ రూరల్ గుండారం గ్రామ పంచాయతీ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన వెంకటేష్‌గౌడ్ పదోన్నతిపై జూనియర్ అసిస్టెంట్‌గా కోటగిరి మండలం పొతంగల్ గ్రామానికి వెళ్లారన్నారు. అనురాధ ఏఎన్ఎం ఆర్మూర్ అర్బన్ నుంచి బదిలీపై వచ్చారు. మాక్లూర్‌లో విధులు నిర్వహించిన రాజ్యలక్ష్మి ఆర్మూర్ మండలం అంకాపూర్ బదిలీపై వెళ్లారని తెలిపారు. బదిలీపై మాక్లూర్ గ్రామానికి వచ్చిన ఇద్దరినీ గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాకేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు నరేందర్, మాజీ వార్డు సభ్యులు లక్ష్మి నారాయణ, లక్ష్మన్, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షులు తిరుమల నర్సగౌడ్, దర్గల సాయిలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదులో సమస్యలున్నాయా?

- అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్
- ఆరు గ్యారంటీల ఆన్‌లైన్ నమోదు పరిశీలన

నవతెలంగాణ-ధర్పల్లి

ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారంటీల ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదులో ఏమైనా సమస్యలున్నాయా అని అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో చేపడుతున్న ఆరు గ్యారంటీల ఆన్‌లైన్ విధానాన్ని సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులు ఎన్నివచ్చాయి, వాటిని ఎలా ఆన్‌లైన్ చేస్తున్నారు, సమస్యలు ఏమైనా ఉన్నాయా ? అని అడిగి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఈజీఎస్‌లో జరుగుతున్న పనులపై పరిశీలించేందుకు కార్యాలయానికి వెళ్లగా.. అక్కడ సిబ్బంది ఒక్కరే ఆపరేటర్ ఉండగా.. ఎవ్వరు ఎక్కడికి వెళ్లారో అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న ఆపరేటర్ శుక్రవారం వరకు జరిగిన పనులకు కంప్యూటరీకరణ చేసిన పత్రాలను వివరాలను వివరించారు. అక్కడినుంచి నేరుగా ఐకెపి కార్యాలయానికి వెళ్లి అక్కడ ఏపీఎం రాలేదని తెలపడంతో మండల



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్

సమైఖ్యా అధ్యక్షురాలు ఎవరని, విఓ ఎంతమంది అని అడుగగా 22 గ్రామాలు 22 మంది సీసీలు ఉన్నారని అరుణ సమాధానం ఇచ్చారు. విద్యార్థులకు అందించవలసిన ఏకరూప దుస్తుల పంపిణీపై ఆరా తీశారు. మొదటి దశ పూర్తయిందని రెండవ దశ 50శాతం అయిందని తెలపడంతో సరిగా పని జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

బడ్జెట్‌లో కార్మికులకు విస్మరించటం సరికాదు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో కార్మికులను విస్మరించడం సరైంది కాదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు తెలిపారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆశావర్కర్ల విస్తృతస్థాయి సమావేశం సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినన్ని నిధులను కేటాయించకపోవడంతో పాటు, కార్మిక సమస్యల పట్ల వారి వైఖరిని తెలియజేస్తుందని అన్నారు. పెట్టుబడిదారులకు కేంద్రం బిజెపి ఎన్డీఏ ప్రభుత్వం రూ.10లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని రాయితీల రూపంలో చెల్లించి కార్మికవర్గానికి మాత్రం కనీస వేతనాలను అమలు జరపకుండా సౌకర్యాలను పెంచకుండా పోరాడి సాధించుకున్న చట్టాలను మార్చి నాలుగు కోట్లుగా చేసి కార్మికుల హక్కులను కాలరాశారని విమర్శించారు. అదేవిధంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఆశావర్కర్లకు, అంగన్వాడీలకు, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలను అమలు జరపటంలో కార్మిక చట్టాలను సౌకర్యాలను పెంచడంలో వివక్షతను పాటించి



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

దేశంలో కార్మికుల పట్ల వివక్షతను పాటిస్తుందని హక్కుల కోసం పోరాటమే ఏకైక మార్గమని పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని ఆమె అన్నారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వలన అన్ని వర్గాల ప్రజల కార్మిక సమస్యలు పెరిగిపోతున్నాయని పోరాడి సాధించుకున్న చట్టాలను అమలు జరపటంలో కానీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను సవరించటంలో కానీ వివక్షతను పాటిస్తున్నారని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సుకన్య, రేణుక, స్వప్న, రమా, సబిత, ఆసియా, పద్మ, రేణుక, సుజాత, దివ్య, శోభ, ఇంద్ర, సాహిర, సలీమా, రాణి తదితరులు పాల్గొన్నారు.

కౌమారదశపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-బోధన్

వర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం బోధన్ మండలం కల్దుర్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, శక్కర్‌నగర్‌లోని మధుమలాంచ ఉన్నత పాఠశాలలో వర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కౌమార దశలో వచ్చే మార్పులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వర్డ్ స్వచ్ఛంద సంస్థ బోధన్ మండల కోఆర్డినేటర్లు చంద్రశేఖర్, కమ్యూనిటీ కోఆర్డినేటర్ రజిత విద్యార్థులకు చట్టాలపై, ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. కౌమారదశలో శరీరంలో జరిగే మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే గృహహింస, మహిళలపై అఘాయిత్యాలు లాంటి నేరాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగయ్య, నరేందర్, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మండల పరిషత్ ప్రాథమిక బాలికల పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా చేసిన పనులను ఎంపీడీవో చింతరాజ శ్రీనివాస్ శనివారం సందర్శించి పరిశీలించారు. పలు తరగతి గదుల్లో చేపట్టిన మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున మరమ్మతులు నిర్వహించిన గదుల్లో ఏమైనా ఇబ్బందులున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకు ఆయన పరిశీలించారు. తాగునీటి ట్యాంకును ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్నకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద ప్రభుత్వం నిధులు సమకూర్చి పనులు చేయించిందన్నారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

'అమ్మమాట అంగన్వాడీ బాట' అవగాహన ర్యాలీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గ్రామంలోని అంగన్వాడీ టీచర్లు అమ్మ మాట అంగన్వాడి బాట, ఈసిసి ఈడే, అక్షరాభ్యాసం తదితర కార్యక్రమాలపై చిన్నారులచే అవగాహన ర్యాలీని నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు, చిన్నారుల తల్లిదండ్రులు, చిన్నారులు, అంగన్వాడి టీచర్లు గంగాజమున, బాలహంస తదితరులున్నారు.

పలు అంశాలపై అధికారులకు అవగాహన

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల రైతు వేదికలో మండల ప్రత్యేకాధికారి శివకృష్ణ (డిఎల్పీఓ) హెల్త్, పంచాయతీ, ఈజీఎస్, ఐకేపీ, సిబ్బందితో సీజనల్ వ్యాధులు, శానిటేషన్ నిర్వహణ, వన మహోత్సవం, ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ శివచరణ్, మండల వైద్యాధికారి ప్రసన్న, అంగన్వాడీ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, ఏపీఓ, ఏపీఎం, ఎఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో రెయిన్ డే సంబురాలు



రెయిన్ డే సంబరాలు జరుపుకుంటున్న చిన్నారులు, ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ శివారులోని గాంధీనగర్‌లో గల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో విద్యార్థులకు రెయిన్‌డే సంబురాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో చిన్నారులు రంగురంగుల గొడుగులు తెచ్చుకొని వర్షానికి తడవకుండా ఉండే దుస్తులు వేసుకొని వర్షంలో కేరింతల కొడుతూ ఉత్సాహంగా ఉల్లాసంగా ఆడుకుంటూ వర్షాకాలపు అద్భుతాలని ఆస్వాదించారు. ఉపాధ్యాయులు పిల్లలకు ప్రయోగాత్మకంగా పిల్లలు వర్షాకాలంలో సరైన దుస్తులు ధరించి అనారోగ్యానికి గురికాకుండా ఉండడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అలాగే ఇంటి వాతావరణాన్ని పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల విషజ్వరాలకు లోనుకాకుండా ఉంటామని వారు పిల్లలకు సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- నిజామాబాద్ సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మావతి
- నవనిర్మాణ్ విద్యార్థి సేన ఆధ్వర్యంలో యంగ్ సైరన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని నిజామాబాద్ సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మావతి తెలిపారు. శుక్రవారం తెలంగాణ నవనిర్మాణ్ విద్యార్థి సేన ఆధ్వర్యంలో యంగ్ సైరన్ డ్రగ్ ఫ్రీ తెలంగాణకు మేము సైతం కార్యక్రమాన్ని నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు మేదరి శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత చెడు మార్గం వైపు వెళ్లవద్దని సూచించారు. ముఖ్యంగా డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా డ్రగ్స్, మాదక ద్రవ్యాలు వాడుతూ పట్టుబడితే వారికి కఠిన



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మావతి

శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. దీనిని దష్టిలో ఉంచుకుని.. మన చుట్టుపక్కల ఉన్న మిత్రులందరికీ అవగాహన కల్పించాలని అన్నారు. డ్రగ్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ఎక్కడైనా డ్రగ్, గంజాయి మాదక ద్రవ్యాలు అమ్ముతున్న, కొనుగోలు చేసి వాడుతున్న వారి సమాచారాన్ని తమకు తెలియజేయాలని సూచించారు. అనంతరం యాంటీ నార్కోటిక్ డీఎస్పీ సోమనాథ్, నగర ఏసిపి రాజా వెంకట్ రెడ్డి, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ విశాల్, విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షులు టీకే శివప్రసాద్, యువ న్యాయవాది పిల్లి శ్రీకాంత్, సామాజిక వేత్త బుస్సాపూర్ శంకర్ మాట్లాడుతూ.. యువత స్వామి వివేకానంద ఆదర్శంగా తీసుకొని దేశ భవిష్యత్తు కోసం చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలియజేశారు. అనంతరం ఆంటీ డ్రగ్ సంబంధించిన కరపత్రాలను, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వినయ్, హర్షవర్ధన్, విష్ణు, అనిరుద్, చందు, మణికంఠ, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించిన ఎంపీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనాసముందర్‌లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలను మండల పంచాయతీ అధికారి సదాశివ్ శనివారం పరిశీలించారు. గ్రామంలో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ జ్వరం, దోమల వల్ల వచ్చే వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టారు. గ్రామంలోని అన్ని వాటర్ ట్యాంక్‌ల వద్ద, మురికి కాలువల వెంట గ్రామ పంచాయతీ సిబ్బందితో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా ఎంపీవో సదాశివ్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందడం వల్ల మలేరియా, డెంగ్యూ వ్యాధులు వచ్చేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఆరుబయట వాడకుండా పక్కన పెట్టిన వస్తువుల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. నీరు నిల్వ ఉండడం వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాల బారిన పడతారన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగర ప్రీతంను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పత్తి కుమార్ సన్మానించారు. వార్షిక బడ్జెట్లో దళితుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధికంగా రూ.33,124 కోట్ల రూపాయలను కేటాయించడం పట్ల ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి గారి ప్రీతం కలిసి కృతజ్ఞతలు తెలిపి సంతోషం వ్యక్తం చేస్తూ సన్మానించడం జరిగిందని శనివారం తెలిపారు.

వాహనాల తనిఖీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్


మండలంలోని 161 జాతీయ రహదారిపై బేగంపూర్ గేటు వద్ద ఎస్సై మహేందర్ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు పాత చాలాన్లను వెంటనే చెల్లించాలని అన్నారు. వాహనదారులు జాతీయ రహదారిపై ప్రయాణం చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలు నడిపి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని అన్నారు. అదే విధంగా వాహనదారులు తమ వాహనాల ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకొని ద్విచక్రవాహనంపై ప్రయాణం చేసే సమయంలో హెల్మెట్లు తప్పక ధరించి జాతీయ రహదారి భద్రత నియమ నిబంధనలు పాటించాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేందర్,కానిస్టేబుల్ రవీందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వహణకై పాఠశాలకు రూ.10 వేల ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద గల ప్రైమరీ పాఠశాలలో గత ఏడు నెలలుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందడం లేదని తెలుసుకున్న సోషల్ జస్టిస్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ డిస్ట్రిక్ట్ డైరెక్టర్ సామంత్‌రెడ్డి, ఆర్మూర్ చైర్మన్ నరేష్ గౌడ్ రూ.10వేల ఆర్థిక సహాయాన్ని పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేషనల్ చైర్మన్ కొప్పుల విజయ్, నేషనల్ జనరల్ సెక్రెటరీ మనోహర్, సౌత్ ఇండియా చైర్మన్ హన్మగౌడ్, స్టేట్ చైర్మన్ సంపత్‌గౌడ్ ఆదేశాల మేరకు ఆర్థిక సహాయం అందించామని అన్నారు. ముందుగా పెట్టుబడి పెట్టాలనే నిబంధనతో ఏ ఒక్క వంట మనిషి ముందుకు రావడం లేదని, ఆ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి, సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని అన్నారు.

కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్‌గా డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-నిజాంసాగర్

కామారెడ్డి జిల్లాలోని మహమ్మద్ నగర్, నిజాంసాగర్ మండలాలకు కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్‌గా డాక్టర్ శ్రీనివాస్ రెడ్డిని తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రతినిధులు నియమించారు. డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి డిఆర్ఎస్ ఫౌండేషన్ ద్వారా చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి ఆయనకు కమ్యూనిటీ మధ్యవర్తిత్వ వాలంటరీగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పజెప్పినందుకు సరైన న్యాయం చేస్తానని తెలిపారు. రెండు మండలాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

పలు కుటుంబాలను పరామర్శించిన రాజేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-నందిపేట్

మండలంలోని పలు కుటుంబాలను భారత రాష్ట్ర సమితి పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జి రాజేశ్వర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. పట్టణానికి చెందిన రిటైర్డ్ సిఐ సయ్యద్ అహ్మద్ మరణించినందున వారి సోదరులు సయ్యద్ హుస్సేన్, కుమారులు ఇమ్రాన్, ఇర్ఫాన్‌ను పరామర్శించారు. ఆంధ్రనగర్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీధర్ తండ్రి మాజీ ఆంధ్రనగర్ సర్పంచ్ నాయుడు వెంకన్న మరణించినందున వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఐలాపూర్ గ్రామంలో కానిస్టేబుల్ శ్రీను తండ్రి మరణించినం దున వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నందిపేట్ మండల భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు మచ్చర్ల సాగర్, ఎంపీపీ వాకిడి సంతోష్ రెడ్డి, జడ్పిటిసి ఎర్రం ముత్యం యమున, మాజీ ఉపసర్పంచ్ భరత్, మాజీ ఎంపీటీసీలు బాలగంగాధర్ ఎర్రం మురళి, ఎర్రటి మోహన్, నాయకులు రాజుగౌడ్, తాటికాయల సాగర్, మచ్చర్ల సతీష్, విజయనగర్ సరేష్, తిలక్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సంతాప సభ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-నవీపేట్

కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ సంతాప సభ పోస్టర్లను మండలంలోని అభంగపట్నం గ్రామంలో సిపిఐఎంఎల్ మాస్‌లైన్ బోధన్ డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై 28 ఖమ్మంలో జరిగే సంతాప సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో నాయకులు సరేందర్, సాయిరెడ్డి, లింబాద్రి, హనుమా న్లు, రేఖా, సుజాత, కవిత తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-బాల్కొండ

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి శనివారం మండల పరిధిలోని బాధిత కుటుంబాలను పరామర్శించారు. నాగపూర్ గ్రామానికి చెందిన బొమ్మిడత పృథ్వీరాజ్ (సన్నీ) ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో మరణించడంతో అతని కుటుంబ సభ్యులను, జలాల్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గడ్డుంద కల్పన అనిల్‌కు మాతృవియోగం కాగా అనిల్‌ను పరామర్శించారు. అనంతరం ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి వన్నెల్ బిలో పర్యటించారు. గ్రామానికి చెందిన వడ్ల నారాయణ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన చోటి నరసయ్య ఇన్ఫెక్షన్ కారణంగా శస్త్రచికిత్స కావడంతో ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, బాల్కొండ పట్టణ అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ మండలాధ్యక్షుడు జావిద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కగంగారెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అటెండర్‌ను సస్పెండ్ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి

నవతెలంగాణ-కామారెడ్డి/ఎల్లారెడ్డి



అటెండర్ విఠల్

ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో అటెండర్ గా విధులు నిర్వహిస్తున్న బి.విఠల్ మత్తు పానీయాలు సేవిస్తూ పాఠశాలకు వచ్చి విద్యార్థినిలను కొట్టడంతో పలువురికి గాయాలు అయ్యాయి. ఈ నేపథ్యంలో స్కూల్ హెచ్ఎం ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి అతనిని విధుల నుండి సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి రాజు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మద్యం మత్తులో ఉండి విద్యార్థులను కొట్టడంపై క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ రూల్స్ 1991 యొక్క రూల్స్ 8 ద్వారా అందించబడిన అధికారాలను ఉపయోగిస్తూ అతనిని తక్షణం సస్పెన్షన్ లో ఉంచబడ్డట్లు ఆయన పేర్కొన్నారు. అతనిపై క్రమశిక్షణ చర్యలు ముగిసే వరకు అతను సస్పెన్స్‌లో ఉంటాడన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియకుండా అతను హెడ్ క్వార్టర్స్ ను విడిచి వెళ్లరాదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అతను గత ఏడెనిమిది నెలల క్రితం రెవెన్యూ శాఖలో వీఆర్ఏగా విధులు నిర్వహించి, పాఠశాలలోకి అటెండర్‌గా వచ్చినట్లు స్థానికులు తెలిపారు.